## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నాయకులు



**నెల్లూరు,డిసెంబరు14 ప్రభాతవార్త-విద్య** కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ అంశంను పరిశీలించాలని కోరుతూ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కాంట్రాక్టు లెక్చరర్స్ జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో-చైర్మన్ కల్లూరు శ్రీనివాసల్‌లు కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు యాక్ట్ 30బై 2023, జీవో 114 అమలు లో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కొంతమేరజరిగిందన్నారు. నిలిచిపోయిన రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంబించాలన్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వారికి కూడా 62ఏళ్ల సర్వీసు పొడిగింపు సమస్యలను పరిష్కరించాలని ఈ మేరకు వినతి పత్రాన్ని ముఖ్యమంత్రికి అందింటం జరిగిందన్నారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు.

## జిల్లా కలెక్టర్ తో భేటీ అయిన ఏపీ టిడ్కో చైర్మన్



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 14, ప్రభాతవార్త** ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌తో పూర్తయిన టిడ్కో ఇళ్లలోనివాసయోగ్యమైన వసతులు కల్పించి లబ్దిదారులు తమ నివాసాలకు రంపించే ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఇల్లు లేని పేదలు ఉండకూడదని నిర్మించిన నాణ్యమైన ఇళ్ళ నివాసానికి వారు రాకపోవడం గురించి సుదీర్ఘ చర్చ జరిపారు. ముందుగా టిట్కో హౌసెస్ దగ్గర జరుగుతున్న అసాంఘీక కార్యక్రమాల కట్టడి చేయాలని, అల్లిపురం వద్ద అతిపెద్ద ట్యాంకర్ నిర్మించినప్పటికీ నీటి వసతి సరిగా అందించలేకపోవడం, మున్సిపల్ సిబ్బంది కొరత వంటి సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వం తరఫున నిధులు విడిపించి మిగిలిన పనులు పూర్తి చేసి స్వచ్ఛందంగా ప్రజలు వచ్చే ఏర్పాట్లు విషయం చర్చించారు. ఈ కార్యక్రమంలో వేముల పాటి అజయ్‌తో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కిషోర్ గునుకుల, జిల్లా పార్టీ ఆఫీస్ ఇంచార్జ్ జమీర్, రిషికేష్ యాదవ్, శరత్, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల ఆశీస్సులే చంద్రబాబుకు శ్రీరామరక్ష



**కోవూరు డిసెంబర్ 14 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే అనారోగ్య.బాధిత పీడితులకు సార్లు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అన్నారు. స్థానిక విపిఆర్ నివాసంలో శనివారం సాయంత్రం అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు బుచ్చి పట్టణానికి చెందిన సిహెచ్ దేవరాజుకు,66651 రూపాయలు. ఇందుకూరుపేట మండలం కాకాని నేరజకు35000 రూపాయలు. కోవూరు చెందిన పాకం సుజాతకు 88000. కొడవలూరుకుచెందిన మారం రెడ్డి కౌసల్యమ్మకు.2,20483 రూ. మొత్తం388578 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు ఇప్పటివరకు కోవూరు నియోజకవర్గంలో.2894245 రూపాయల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న అనారోగ్య పీడితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో విడవలూరు ఇంచార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి యువ నేత బెజవాడ వంశీకృష్ణారెడ్డి బుచ్చి ఇంచార్జ్ అడపాల అవినాష్ రెడ్డి తదితరులు ఉన్నారు

## నేడు ఆత్మార్పణ దినోత్సవం



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 14, ప్రభాతవార్త** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆ మహనీయుని వర్ధంతిని (డిసెంబర్ 15) ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం ఉదయం నగరంలోని ఆత్మకూరు బస్టాండు కూడలి వద్ద గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా అధికారులు, పలువురు ప్రముఖులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తారు. అనంతరం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్లోని సిబ్బంది పాల్గొని నివాళులర్పిస్తారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో నగర ప్రజలు, ప్రముఖులు పాల్గొని ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన ఆ ధన్యజీవికి నివాళులర్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి రూ.4లక్షల విరాళం



**నెల్లూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త-వైద్యం** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పొదలకూరు రోడ్డులో ఉన్న రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌కి శనివారం దివంగత చింత లలితమ్మ జ్ఞాపకార్థం దేవల్ల శ్యామల రూ.4లక్షల చెక్‌ను రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఎంఎస్ఆర్ స్టాటిక్స్ సెంటర్ కన్వీనర్ ఎంవీ సుబ్బారెడ్డి(నేతాజీ), రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, ఆర్థోపెడిక్స్ డాక్టర్ హరికృష్ణారెడ్డి, క్యాన్సర్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఐ.భక్తవత్సలరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## మాలకొండ ఆదాయం రూ.8.3లక్షలు

**వలేటివారిపాలెం డిసెంబర్ 14, ప్రభాతవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు. తద్వారా స్వామివారికి రూ.8,39,050ల మేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన అర్చకులు గౌరీ భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.8,850లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.23,000లు, వివాహాల నిర్వహణ వలన రూ.18,000లు,తలనీలాలు టిక్కెట్లు వలన రూ.30,325లు,వాహనపూజల వలన రూ.1,780లు, ప్రత్యేకదర్శనం రూ.2,68,800లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.580లు,రూముల అద్దెలు రూ.33,830లు,కవర్లు అమ్మకం వలన రూ.6,300లు,అన్నదానం నిమిత్తం రూ.2,49,710లు,లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.1,97,185లు విరాళాలు 1,000లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు.

## జిల్లా అభివృద్ధి ప్రణాళిక విడుదల



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 14, ప్రభాతవార్త** 2029 నాటికి 15 వృద్ధి రేటు లక్ష్యంతో ప్రస్తుత జిడిపి రూ. 61,664 కోట్ల నుంచి రూ. 1,31, 180 కోట్లకు చేరుకునేందుకు జిల్లా అభివృద్ధి ప్రణాళిక రచించినట్టు జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్ తెలిపారు. శుక్రవారం విజయవాడలో జరిగిన స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ విడుదలలో భాగంగా నెల్లూరు జిల్లాకు సంబంధించి జిల్లా అభివృద్ధి ప్రణాళిక విడుదల చేశారు. జిల్లాలోని కృష్ణపట్నం పోర్ట్ 12 బర్త్‌ల తో దేశం లోనే తొలి గ్రీన్ ఫీల్డ్ పోర్ట్‌గా జూలై 2008లో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించిందన్నారు. అలాగే 3,700 కోట్ల అంచనాతో 4 బర్త్‌ల డీప్‌సీ పోర్ట్‌గా రామాయపట్నం పోర్ట్ నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. అదేవిధంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా 25,000 మందికి ఉపాధి లభిస్తుందన్నారు.అదేవిధంగా ప్రాథమిక రంగమైన వ్యవసాయంలో 73,116 హెక్టార్ల సాగు చేయదగిన భూమిని 5 ఏళ్లలో సాగులోకి తేవడం, పప్పు పంటల విస్తీర్ణం 12,740 హెక్టార్ల నుంచి 22,499 హెక్టార్లకు పెంచడం లక్ష్యమన్నారు. అదేవిధంగా ఎఫ్‌పీవోలు, ఈ మార్కెట్లు ఈకామర్స్ ప్లాట్‌ఫారాలను అభివృద్ధి చేయడం, ఎమ్‌జిఎన్ ఆర్ఈజీఎస్ సదుపాయాలను సమీకరించి పశువుల షెడ్లు నిర్మించడం, మేత ఉత్పత్తి పెంచుతామన్నారు. అలాగే మైక్రో ఇరిగేషన్ క్రింద 10,395 హెక్టార్ల నుంచి 18,178 హెక్టార్లకు విస్తరించడం, ప్రతి పంటలో వార్షికంగా 15 వృద్ధి సాధించటం, ఈ మార్కెట్లు అభివృద్ధి చేసి రిటైల్ షాపులు, గోదాములు, వెజిటబుల్ మార్కెట్లు నెలకొల్పడం లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల రంగం అభివృద్ధిలో భాగంగా మెగా, మైక్రో, చిన్న సంస్థల సంఖ్య 11,992 నుంచి 24,004కి పెంచడం, పోర్ట్ ఆధారిత పరిశ్రమల కోసం భూబ్యాంకుల అభివృద్ధి చేయడం, గార్మెంట్, చెక్క పరికరాలు వంటి క్లస్టర్లను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సేవల రంగంలో 2047 నాటికి అత్యుత్తమ ఆరోగ్య సేవలను అందించటం, శిశుమరణ రేటు తగ్గించడం మరియు పోషణ లోపం తగ్గించడం లక్ష్యమన్నారు. అన్ని టూరిస్ట్ ప్రదేశాలను డిజిటల్ రిపాజిటరీగా అభివృద్ధి చేయడం, సర్వేపల్లి ట్యాంక్, మైపాడు బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ ప్రారంభిస్తామన్నారు. 100 అక్షరాస్యత లక్ష్యంతో 1.5 లక్షల మందికి 1 సంవత్సరంలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

### నిరుద్యోగ సమస్యకు పరిష్కారమే జాబ్ మేళా



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త : యువతకు** ఉపాధి కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబే ఈ జాబ్ మేళా నిర్వహణకు ప్రేరణ అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీని మెగా జాబ్‌మేళా ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని, జిల్లా యువత దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేది ఆదివారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించే ఈ మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు నెలల క్రితం నిర్వహించిన జాబ్‌మేళాలో దాదాపు వెయ్యికి పైగా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌బాబు ఆకాంక్షల మేరకు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్‌మేళాలో వందకు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సారి విప్రో , టెక్ మహీంద్ర, అసెంచోర్ లాంటి 14 ప్రముఖ ఐటీ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో ప్రాతినిథ్యం వహించనున్నాయన్నారు. ఆదివారం నిర్వహించే ఈ జాబ్‌మేళా ద్వారా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 10 వేల మందికి పైగా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నిరుద్యోగుల కళ్లలో ఆనందం చూడాలన్నదే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆశయమన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ నిర్వహించే సామాజిక సేవలో భాగంగా తమవంతు సహాయంగా నిరుద్యోగ యువత కోసం వీపీఆర్ ఫౌండేషన్ జాబ్‌మేళా నిర్వహిస్తుందన్నారు.

**జిల్లా వాసుల అదృష్టం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి** లాంటి మహోన్నత వ్యక్తి ఎంపీ కావడం నెల్లూరు జిల్లా వాసుల అదృష్టమని రూరల్ ఎమ్మెల్యే సోదరులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఎంపీలుగా ఎంతో మంది పనిచేశారని, ప్రజల కోసం పనిచేసే ఎంపీని తొలిసారిగా చూస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాసేవలో తరిస్తున్న వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల అనీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఫలించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వ్యూహం

### 150 సాగునీటి సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నిక



**వింజమూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వ్యూహం ఫలించింది. తొలి అడుగులోనే ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగరవేసి రికార్డు సృష్టించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రెండవ అడగులో కూడా అదే జోరు కొనసాగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నాయకులతో గత మూడు రోజులుగా సమాయత్తమై ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నియోజకవర్గంలోని సుమారు 150 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లను కైవసం చేసుకోవడం జరిగింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం పట్ల ఇటు అధికారులు అటు నాయకులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేస్తున్నారు. దాదాపు 1000 మందికి పైగా ఉమ్మడి ప్రభుత్వంలో నాయకులు, కార్యకర్తలు పదవులలో కొలువు దీరారు. కొత్తగా ఎన్నికైన వారు మా పై నమ్మకంతో గురుతర బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ పదవికి వన్నెతెస్తూ చెరువులు, పార్టీ అభివృద్ధికి కషి చేస్తామని ఘంటా పదంగా తెలియజేస్తున్నారు.

## రైతులు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయను

### 587 టీసీలు ఏకగ్రీవం కావడం చారిత్రాత్మకం

### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



**కావలి, డిసెంబర్14 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గ రైతులు, ప్రజలు తనపై, కూటమిప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని, ఆశల్ని వమ్ముచేయనని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లు శనివారం కావలి ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివెళ్లారు. ఎమ్మెల్యే దగుమాటిని ఘనంగా సత్కరించారు. ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. భారీగా విచ్చేసినవారితో టిడిపి కార్యాలయం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో మేజర్ కాలువలు 8, మైనర్ చెరువులు 58, మీడియం కాలువలు 14 ఉన్నాయని తెలిపారు. మొత్తం 588 టీసీలకుగాను 587 టీసీలకు ఎన్నికలు జరగడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో 587 టీసీలు ఏకగ్రీవం కావడం జరిగిందన్నారు. కావలి నియోజకవర్గ చరిత్రలో ఈ విజయం చారిత్రాత్మకమన్నారు. టిడిపి, బిజెపి, జనసేన పార్టీ అధిష్ఠానం పెద్దల ఆదేశాలమేరకు ఎన్నికల్లో కలిసి పోటీచేయడం జరిగిందన్నారు. అభివృద్ధి, సక్షేమం రెండుకళ్లుగా ఈ ప్రభుత్వం ముందుకుదూసుకుపోతుందని తెలిపారు. గ్రామగ్రామాన ప్రజల్లో టిడిపిపట్ల బలంబాగా పెరిగిందన్నారు. కాలువలను, చెరువులను అభివృద్ధిచేసుకుంటూ చివరిఆయకట్టువరకు ప్రతి ఎకరాకు నీరందించేందుకు కృషిచేస్తానన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలవడానికి కృషిచేసిన ప్రతి రైతును అభినందిస్తున్నామన్నారు. వారందరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఏ కష్టం రాకుండా జాగ్రత్తగా చూసుకుంటానని ఎమ్మెల్యే దగుమాటి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పలువురిని సత్కరించి అభినందనలు తెలిపారు.

## నూతననిర్మాణ అనుమతులను తనిఖీ చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 14,ప్రభాతవార్త** : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు సంబంధించిన నిర్మాణ అనుమతుల దస్త్రాలను శనివారం తనిఖీ చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల మేరకు నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం మాగుంట లేఔట్ పంపింగ్ హౌస్, ఈ.ఎస్.ఎల్.ఆర్ వాటర్ ట్యాంకులను తనిఖీ చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ విభాగం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ప్రాంగణంలో పరిశుభ్రతను పాటించండి కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 14,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో అపరిశుభ్రతకు తావు లేకుండా అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్యాలయం ప్రాంగణంలోని ఫౌంటెన్, పార్కింగ్ ప్రదేశం తదితరాలను కమిషనర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్న ప్రయాణికుల బగ్గీ వాహనాన్ని రిపేర్లు మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రదేశం, జనరేటర్ ఉన్న ప్రదేశాలను పరిశుభ్రం చేసి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కార్యాలయ సిబ్బంది వాహనాల పార్కింగ్ ప్రదేశంలో బయట వ్యక్తుల వాహనాలు ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఫౌంటెన్ ల పనితీరును పరిశీలించి తిరిగి పని చేసేలా అవసరమైన అన్ని చర్యలు వెంటనే తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రాంగణంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఐరన్ వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచేలా ప్రతిరోజూ అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఈ. ఈ.లు శేషగిరిరావు, రంతు జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.500లకే మెడికవర్‌లో ఫ్యామిలీ హెల్త్ కార్డ్




**నెల్లూరు,డిసెంబర్ 14, ప్రభాతవార్త-వైద్యం** సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందాలన్న సంకల్పంతో నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కేవలం రూ.500ల ఫీజుతో ఫ్యామిలీ హెల్త్ కార్డును అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్పీ కృష్ణకాంత్, మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సెంటర్ హెడ్ ధీరజ్‌రెడ్డిలు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో ఫ్యామిలీ హెల్త్ కార్డుని కృష్ణకాంత్, ధీరజ్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్డు ద్వారా ఎంతో విలువైన వైద్య సేవలను, పరీక్షలు ,మందులను అతి తక్కువ ఖర్చుతోనే పొందవచ్చని అన్నారు. తొలి కార్డును హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, మార్కెటింగ్ హెడ్ సతీష్, ఎస్పీ కృష్ణకాంత్‌కు అందజేశారు. ఈ ఫ్యామిలీ కార్డు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ ఈ కార్డును తీసుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు. ఈ కార్డు పొందిన వారితో సహా వారి కుటుంబ సభ్యులంతా ఓపీ కన్సల్టేషన్‌పై 25 శాతం, ఓపీ పరీక్షలపై 15 శాతం రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. అలాగే అడ్మిషన్‌పై 10 శాతం, వైద్యేతర సేవలపై 50శాతం, 10 కిలోమీటర్ల లోపు ఉచిత అంబులెన్స్ సదుపాయం, హోమ్ హెల్త్ కేర్ సేవలపై 30 శాతం రాయితీ లభిస్తుందన్నారు. మందులపై 20 శాతం, హెల్త్ చెకప్‌పై 10 శాతం, సూపర్ స్పెషాలిటీ వైద్యులతో రెండు సార్లు వీడియో సంప్రదింపులు, మరో రెండు సార్లు వైద్యులతో ఉచితంగా ఓపీ కన్సల్టేషన్ లభిస్తుందని డాక్టర్ ధీరజ్ రెడ్డి వెల్లడించారు. ఈ ఫ్యామిలీ కార్డును దేశంలోని అన్ని మెడికవర్ హాస్పిటల్స్‌లలో వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్డు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఓ చందు వర్మ పాల్గొన్నారు.

## ఏ కిస్తీపురం సాగునీటి సంఘ ఎన్నికలలో ఉద్రిక్తత



**వింజమూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** వింజమూరు మండలం ఏకిస్తీపురం సాగునీటి సంఘం ఎన్నికలలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అధికారుల తీరుపై వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఏ కిస్తీపురం పరిధిలో 119 ఓట్లు ఉండగా 6 మందికి మాత్రమే తహశీల్దార్ కౌంటర్ సైన్ పెట్టడంతో ఎన్నికలు అధికారుల ప్రోద్బలంతో ఏకపక్షంగా జరిగాయని స్థానిక వైసీపీ నేతలు సాగునీటి సంఘ ఓటర్లు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలో సాగునీటి సంఘ ఓటర్లు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రెండు రోజులు ముందుగానే వీఆర్వోతో సంతకాలు నో డ్యూ సర్టిఫికేట్లపై సంతకాలు పెట్టించినప్పటికి తహశీల్దార్ కౌంటర్ సైన్ చేయకపోవడంతో నామినేషన్ వేసేందుకు అధికారులు తిరస్కరించారు. దాంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నేతలు చల్ల వెంకటేశ్వర్లు గూడా నరసారెడ్డి ఎన్నికలను సజావుగా జరిపించాలని ఉద్దేశంతో గ్రామంలో రైతులకు నచ్చచెప్పినప్పటికి ససేమీరా అనడంతో పరిస్థితి చేయి దాటిపోతున్న పరిస్థితుల్లో వింజమూరు ఎస్సై వీర ప్రతాప్ తన సిబ్బందితో వెంటనే ఏకిస్తీపురం గ్రామానికి చేరుకుని ఎన్నికల నిబంధనల మేరకు ఓటు హక్కు కలిగిన వారు మాత్రమే ఉండాలని, మిగిలిన వారు ఎలాంటి ఆందోళనలు చేయకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. దాంతో వైసీపీ మద్దతు దారులు ఎన్నికలను బహిష్కరించి వెళ్ళిపోవడంతో మిగిలిన సభ్యులతో ఎన్నిక సజావుగా జరిపించారు.

## పులివర్తి ప్రసాద్ కు సన్మానం



**వరికుంటపాడు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** గండిపాళెం ప్రాజెక్టు పరిధిలోని 5 వ నెంబర్ కాలువ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనా పులివర్తి ప్రసాద్ ను మరియు వైస్ చైర్మన్ గా ఎన్నికైన యేనుగంటి నాగేశ్వరరావులను తెలుగుదేశం పార్టీ నేతలు గుర్రం గోపి, పొద మాధవ్‌రావు లు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పులివర్తి ప్రసాద్ మాట్లాడుతూ 5వ నెంబర్ కాలువ చైర్మన్ గా తనకు అవకాశం కల్పించిన ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ కు, మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ చంద్ర మధుసూధన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కాలువ పరిధిలోని ప్రతి రైతుకు నీరు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

## సాగునీటి సంఘాల కమిటీలు ఏకగ్రీవంగా ఎంపిక

## ఎంపిక కమిటీల వివరాలు ఇలా ఉన్నాయి



**వలేటివారిపాలెం డిశంబరు 14, ప్రభాతవార్త :** మండలంలో సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. అధికార పార్టీ సభ్యులే దాదాపుగా ఎంపికైనారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహ ణకుగానూ ఆయా గ్రామాల సంఘాలకు ఎన్నికలఅధికారులను నియమి ంచారు. ఈ కార్యక్రమాన్ని తహసిల్దార్ అబ్దుల్ హమీద్ పర్యవేక్షించారు. చుండికి సాగునీటి సంఘం అధ్యక్షులుగా అమ్మపాలెం గ్రామరైతు పసుపులేటి జయరాం, ఉపాధ్యక్షులుగా చుండి గ్రామానికి చెందిన కామినేని వీరయ్య, సభ్యులుగా తూమాటి వెంకటేశ్వర్లు, మీనుగ మాల్యాద్రి, చెరువుపల్లి మల్లికార్జున కండ్లగుంట నరసింహంలు ఎంపికైనారు. ఈ కార్యక్రమంలో మాలకొండ మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, మోడల్‌స్కూలు మాజీ చైర్మన్ చెరువుపల్లి సాంబయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు. అంకభూపాలపురం అధ్యక్షుడుగా పెగడా మాల్యాద్రి, ఉపాధ్యక్షుడుగా బోడా పెదబాలకొండమ్మ, సభ్యులుగా పెగడా పెదమాల్యాద్రి, పెగడా ఆదినారాయణ, పంది వరలక్ష్మీలు ఎంపికైనట్లు ఎన్నికలఅధికారి ఏ మల్లికార్జున ప్రకటించారు. బడేవారిపాలెం అధ్యక్షుడుగా ఇంటూరి ఆదిశేషయ్య, ఉపాధ్యక్షుడుగా బత్తిన సురేష్, సభ్యులుగా గొట్టిపాటి సుబ్బారావు, కొల్లా సుశీల, దాచర్ల చెంచురా మయ్య, ఉన్నం కోటేశ్వరరావులు ఎంపికైనట్లు ఎన్నికలఅధికారి పొటకారి నాగేశ్వరరావు ప్రకటించారు.

## ప్రశాంతంగా సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు



**పొదలకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** పొదలకూరు పంచాయతీ సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా ప్రశాంతంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెనుమల్లి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోగినేని అర్చన, టిసిలుగా కండే పెంచలయ్య, బిల్లు బుజ్జమ్మ, మంగళి పూడి వెంకటేశ్వర్లు, మాలపాటి రామచంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బొద్దులూరు మల్లికార్జున నాయుడు, వీరేపల్లి పార్థసారథి రెడ్డి, బోగోలు భాస్కర్ రెడ్డి, వెంపులూరు రామకృష్ణ గౌడ్, దార్ల ఆశీర్వాదం, మంగళపూడి నవీన్, కైతేపల్లి మురళి పాల్గొన్నారు.

## మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం



**మర్రిపాడు, డిసెంబర్14, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 16సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా 13చోట్ల ఏకగ్రీవం కాగ చినమాచనూరు, నాగినేనిగుంట, పెగళ్ళపాడులో జరగాల్సిన సాగునీటి సఘాల ఎన్నికలు టిడిపిలోని వర్గ పోరుతోవాయిదా పడ్డాయి. సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా 144సెక్షన్ అమలు చేసి పోలింగ్ కే ంద్రాల వద్ద పోలీసు బందోబస్తు చేశారు. సిఐ గంగాధర్ , ఎస్ఐ శ్రీనివాసరావ్, పోలీసు సిబ్బందితో కలిసి పర్యవేక్షిస్తూ ప్రశాంతమైన వాతా వరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేశారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలలో అన్ని ఏకగ్రీవాలే



**కలువాయి డిసెంబర్ 15 ప్రభాతవార్త :** మండలంలోని 10 నీటి సంఘాల కు సంబందించి ఎన్నికలు నిర్వహించగా కూటమి ప్రభుత్వానికి సంబంధించి అభ్యర్దులందరు అద్యక్ష, ఉపాధ్యాక్ష పదవులకు ఏకగ్రీవాలు కావడం జరిగింది. ఇందులో కలువాయి నీటి సంఘం అధ్యక్షులుగా చల్లా విజయబాస్క ర్‌రెడ్డి , ఉపాధ్యాక్షులుగా వింజం మల్లికార్జునరావు, తెలుగురాయిపురం అధ్యక్షులుగా మల్లి విజయ్‌కుమార్‌రెడ్డి , ఉపాధ్యాక్షులుగా మన్నెం శ్రీదర్, దాసరిపల్లి అధ్యక్షులుగా మక్కిన చిన్నపెంచలయ్య, ఉపాధ్యాక్షులు కాపా పెదబాబులు, పెదగోపవరం అధ్యక్షులుగా బాలిరెడ్డి చిన్న నరసారెడ్డి, ఉపాధ్యాక్షులుగా సింగంరెడ్డి పెంచలనరసారెడ్డి, చవటపల్లికి అధ్యక్షునిగా మాగినేని శ్రీకాంత్ , ఉపాధ్యాక్షుని దేవినేని రత్నయ్య, కనుపూరుపల్లి అధ్యక్షునిగా గద్దె హరిబాబు, ఉపాధ్యాక్షుని బోయిళ్ళ కొండారెడ్డి, తిరుమలపాడు అధ్యక్షునిగా నిమ్మకాయల రామచంద్రయ్య, ఉపాధ్యాక్షునిగా పువ్వాడి సురేష్, చీపినాపి అధ్యక్షునిగా బొల్లినేని ఆంజనేయులునాయుడు, ఉపాధ్యాక్షునిగా సింగమనేని రఘవేంద్రబాబు, తెలుగురాయపురం అధ్యక్షుని రాంనారాయణరెడ్డి, ఉపాధ్యాక్షునిగా నరికే నరసింహులు, కుల్లూరు అధ్యక్షునిగా దేవరకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాక్షునిగా మాలే చిన ఓబులేసులు ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా కూటమినాయకులు వారిని అబినందించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం లో ఒక వెలుగు వెలిగి వైసిపి ప్రభుత్వంలో కనుమరుగైన నీటి సంఘాలు తిరిగి జీవం పోసుకున్నాయని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లునాయుడు అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సంఘాల పేరు తిరిగి తెరపైకి వచ్చిందని నీటి సంఘాలు ఏర్పాటు చేయాలని వాటికి ఎన్నికలు జరపాలని నిర్ణయించిన కూటమి ప్రభుత్వం రానున్న రోజులలో రైతులకు మరెన్నె మహత్తర కార్యక్రమాలు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా శివారెడ్డి, పీర్ల సోమయ్యయాదవ్, జగదల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మాలల మహాగర్జనను జయప్రదం చేయాలి..!

## మాలమహానాడు జేఏసి నేతల పిలుపు




**కావలి, డిసెంబర్14 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ అఖిలభారత మాలసంఘాల జేఏసి ఆధ్వర్యంలో జరుగుతున్న "హలో మాల... ఛలో గుంటూరు" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాల ఉద్యోగ సంఘాల, మాలమహానాడు జేఏసి నేతలు పిలుపునిచ్చారు. శనివారం కావలిపట్టణం రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాలల మహాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాలమహానాడు కావలి డివిజన్ అధ్యక్షులు ఎల్లంటి వెంకటేశ్వర్లు, కార్యదర్శి మేడికొండ సుకుమార్, మాల ఉద్యోగుల సంఘం కావలి డివిజన్ అధ్యక్షులు పి.జయప్రకాష్, జాయింట్ కార్యదర్శి ఎం.ఆనందరావులు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపేరుతో ఎస్సీలను విడదీయడం సరైనపద్దతి కాదన్నారు. గత 40సంవత్సరాలక్రితం ఎస్సీ జనాభా 16శాతం ఉన్నపుడు ఎస్సీలకు 15శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ఇప్పుడు జనాభా మూడువంతులు పెరిగినా అదే రిజర్వేషన్ కొనసాగిస్తున్నారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలన్నారు. అలా చేయకున్నా ఎస్సీ వర్గీకరణచేసి మాలలను, మాదిగలను వేరుచేయడం, ఏబీసీడీ వర్గీకరణ చేయడం మంచిదికాదన్నారు. కలిసిఉంటేనే ఏదైనా సాధించగలమన్నారు. ఎస్సీవర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15వతేదీ ఆదివారం గుంటూరునగరం నల్లపాడు రోడ్డు, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, సీతారామ టౌన్‌షిప్ ఎదురుగా సాయంత్రం 4గంటలకు నిర్వహించే మాలల మహాగర్జన కార్యక్రమానికి లక్షలాదిమంది మాలలు తరలివచ్చి పాల్గొంటారని తెలిపారు. కావలి నియోజకవర్గంనుంచి కూడా అత్యధిక సంఖ్యలో మాలలు తరలిరావాలని కోరారు. కావలినుంచి మాలల మహాగర్జనకు వచ్చే మాలలకు పట్టణంలోని తుమ్మలపెంటరోడ్డు అంబేద్కర్‌పార్క్‌వద్ద వాహనాలు ఏర్పాటుచేసిఉన్నామని వారు తెలిపారు. ప్రతిఒక్కరూ ఆదివారం ఉదయం 10 గంటలకు అక్కడికి చేరుకోవాలన్నారు. గుంటూరుకు తరలివచ్చే మాలసోదరులందరికీ సౌకర్యాలన్నీకూడా కల్పించిఉన్నామన్నారు. ఈ సమావేశంలో జేఏసి మెంబర్లు ఎం.ఉదయభాస్కర్, ఏ.సుందర్, ఎం.రామారావు, మనోహర్‌లు పాల్గొన్నారు.

## గుడ్లూరు వారి పాలెం లో రక్త దానం



**వెంకటాచలం, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** గుడ్లూరువారి పాలెంలో టిడిపి సీనియర్ నాయకులు ఈపూరు మురళీధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా నెల్లూరు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బారీగా యువత రక్త దానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 200 మంది యువత పాల్గొని స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ప్రతి ఏట మాదిరిగా ఈ ఏడాది మురళీధర్ రెడ్డి జన్మదినాన్ని అత్యంత ఘణంగా నిర్వహించారు. గ్రామంలో పేదలకు అన్నదానం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు

**-మోటర్ బైక్ ర్యాలీ ప్రారంభించిన రాజగోపాల్ రెడ్డి :** సర్వేపల్లి ఎమ్మెల్యే తనయుడు, సర్వేపల్లి నియోజకవర్గ టిడిపి సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బైక్ ర్యాలి ని ప్రారంభించారు. వెంకటాచలం లోని సర్వేపల్లి రోడ్డు వద్ద నుంచి రజగోపాల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి బైక్ నడుపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బారీగా 200 వంది బైక్ ర్యాలీతో సర్వేపల్లి రోడ్డు వద్ద నుంచి గుడ్లూరువారి పాలెం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా యువత కేక్ కట్ చేసి పూలమాలతో, శాలువాలతో మురళీధర్ రెడ్డిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గుడ్లూరు పాలెం వద్ద భారీ క్రేన్ తో గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## వినోద్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

**ఉలవపాడు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** గుడ్లూరు మండలం చేవూరు గ్రామానికి చెందిన యువ రైతు నక్కల వినోద్ కుమార్ శుక్రవారం ఆత్మహత్య చేసుకుని మరణించారు. ఆయన మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు కే.నాంచార్లు, జిల్లా కోశాధికారి చలంచర్ల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కే.నాంచార్లు మాట్లాడుతూ చేవూరు గ్రామానికి చెందిన నక్కల వినోద్ కుమార్‌కు గ్రామంలో 5.47 ఎకరాల భూమి కలదు. ఈ భూమిలో 2.22 ఎకరాలను రామాయపట్నం ఓడరేవుకు అనుబంధంగా ఉన్న పరిశ్రమల కోసం సేకరించారు. కానీ పరిశ్రమల కోసం సేకరించిన తన భూమికి పరిహారం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయి విసుకువచ్చింది. శుక్రవారం తాను నివసిస్తున్న గృహంలో ఉరి వేసుకుని మరణించారు. ఈ సందర్భంగా తనకు రావాల్సి న భూ పరిహారం తనకు మంజూరు చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని సెల్ఫీ వీడియోలో చెప్పి మరణించారు. ఆయన మరణానికి కాకులైన అధికారులపై ఇతరులపై చర్యలు తీసుకోవాలని నక్కల వినోద్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గుడ్లూరు మండలం ఆవులవారిపాలెం, మొండివారిపాలెం ప్రాంతాల్లో నిర్మిస్తున్న రామాయపట్నం ఓడరేవుకు అనుబంధ పరిశ్రమల కోసం బలవంతంగా సేకరించిన భూములకు తక్షణమే పరిహారం చెల్లించి మరింత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పెద్దపవని సాగు నీటి సంఘం అధ్యక్షునిగా మలిశెట్టి నాగేశ్వరావు ఏకగ్రీవ ఎన్నిక



**లింగసముద్రం, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండలంలోని పెద్ద పవని సాగు నీటి సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షు డు గా మలిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గిన్నె చినమాల్యాద్రిలను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి అబ్రహం లింకన్ తెలిపారు. అలాగే టీసీ మెంబర్లుగా గనిపినేని నరసింహారావు, ముత్తినేని వెంకట ప్రసాద్, మలిశెట్టి నాగేశ్వరరావు, గిన్నె చిన్న మాల్యాద్రి, షేక్ ఖాదర్ భాషా, బొప్పూరి మస్తాన్‌లు ఎన్నికైనట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు గొరైపాటి సాంబయ్య, జనసేన పార్టీ అధ్యక్షుడు మలిశెట్టి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నక్కా వినోద్ కుటుంబానికి ప్రభుత్వం 50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

## వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్



**కావలి, డిసెంబర్14 ప్రభాతవార్త :** రామాయపట్నం పోర్టుకు భూమి ఇచ్చి పొలండబ్బులు ఇవ్వకపోవడంతో నక్కా వినోద్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయన కుటుంబానికి 50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వ్యవసాయకార్మికసంఘం నేతలు డిమాండ్‌చేశారు. శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వ్యవసాయకార్మికసంఘం రాష్ట్రకమిటీ సభ్యుడు టి.మాల్యాద్రి, అధ్యక్షుడు పి.సీతారామయ్య, కార్యదర్శి ఎం.రాధాకృష్ణయ్యలు మాట్లాడారు. చేవూరి వాస్తవ్యులు నక్కా వినోద్‌కుమార్ రామాయపట్నం పోర్టుకు భూములిచ్చారన్నారు. 3 సంవత్సరాలనుండి డబ్బుకోసం తిరుగు తున్నా ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. పిల్లల చదువులకోసం కావలిలో బాడుగ ఇంట్లో ఉంటూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడు ఆత్మహత్య చేసుకోబోయేముందు సెల్ఫీ వీడియోరిలీజ్ చేశాడన్నారు. భూసేకరణ అధికారి దుర్మార్గానికి ఆ కుటుంబం బలైందని తెలిపారు. రెవిన్యూ కార్యాలయాలు పేద ప్రజలకు, రైతులకు న్యాయమైన సమస్యలను పరిష్క రించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. డబున్నవారికే తహశీల్దారు కార్యాలయాలలో పనులు జరుగుతున్నాయని విమర్శించారు.

## ఖర్చు, కాలయాపనలేని అంతిమతీర్పు లోక్‌అదాలత్‌లో సాధ్యం..! 2738 కేసులు పరిష్కారం..!!



**కావలి, డిసెంబర్14 ప్రభాతవార్త :** ఖర్చు, కాలయాపనలేని అంతిమతీర్పు లోక్‌అదాలత్‌లో సాధ్యమవుతుం దని, ఇరు పార్టీలవారు సమన్యాయం పొందవచ్చునని కావలి సీనియర్ సివిల్‌జడ్జి ఎం.శోభ తెలిపారు. కావలి సబ్‌కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. ఈ లోక్‌అదాలత్‌లో 2738 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయన్నారు. 22 సివిల్‌కేసులు, 698 క్రిమినల్‌కేసులు, 2000 యస్‌టిసీ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు అన్నీ కలిపి 2738 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. అలాగే, దాదాపు రూ.22,00,000ల నగదు రికవరీ చేశామని తెలిపారు. సీనియర్ సివిల్‌జడ్జి ఎం.శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జె.కాత్యాయనిలు ఈ కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిపి పి.కె రామకృష్ణ, ఎపిపి మృదుల, కావలి న్యాయవాదసంఘం అధ్యక్షులు కె.సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు సిహెచ్ సునీల్, న్యాయవాదులు కె.శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జి.మాల్యాద్రి, ఎస్ఎక్స్ కెనడి, కలీమ్ రోజ్‌దార్, వై.వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, ఐ.సాయిప్రసాద్, పివి రమణారెడ్డి, కిరణ్, బెంచ్ మెంబర్లు, జె.శ్రీదేవి, కె.రాము, జూనియర్ న్యాయవాదులు, లోక్‌అదాలత్ మెంబర్ యం.మాలకొండారెడ్డి, పోలీసులు, కోర్టుసిబ్బంది, వివిధ బ్యాంకులవారు, కక్షిదారులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘం ఎన్నికలు తెలుగుదేశంపార్టీ కైవసం



**దగదర్తి, డిసెంబర్14 ప్రభాతవార్త :** దగదర్తి మండలం లో శనివారం జరిగిన సాగునీటిసంఘం ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయకేతనం ఎగురవేసి ంది. మొత్తం 20 మైనర్, 6 మేజర్ సాగునీటిసంఘం ఎన్నికలు జరుగగా తెలుగుదేశంపార్టీ అభ్యర్థులు ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను కావలి శాసనస భ్యులు కావ్యకృష్ణారెడ్డి ప్రతిష్టాకరంగా తీసుకుని గెలుపుబాధ్యతలు తెలుగుదేశంపార్టీ రాష్ట్రకార్యదర్శి పమిడి రాజ్‌కుమార్‌చౌదరికి అప్పగించారు. ఆయన నేతృ త్వంలో 20 మైనర్, 6 మేజర్ సాగునీటిసంఘం ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగురవేసింది. తెలుగు దేశంపార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు కృషిచేసిన దగదర్తి మండల రైతులకు పమిడి రవికుమా ర్‌చౌదరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, తెలుగుదేశంపార్టీ నాయకులు, గ్రామపార్టీనాయకులు, కార్యకర్తలు ఈ విజయానికి ఎంతగానో కృషిచేశారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలి



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** శనివారం కలక్టరేట్‌లో గల డిఆర్‌డిఏ మీటింగ్ హాల్‌లో స్త్రీ నిధి 18వ సర్వసభ్య సమావేశం గూగుల్ మీట్ ద్వారా వర్చువల్ గా అన్ని జిల్లా లలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మంత్రి ఎస్‌ఈఆర్‌పి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ స్త్రీ నిధి బ్యాంకును ఇంకా పొదుపు మహిళలకు దగ్గరగా తీసుకొని వెళ్ళి తద్వారా వ్యాపారాలు చేసి ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదిగి లక్షాధికారి కావాలని కోరారు. తదుపరి ఎస్‌ఈఆర్‌పి సిఈఓ వీరపాండ్యన్ మాట్లాడుతూ స్త్రీ నిధి బ్యాంకు ద్వారా మరిన్ని రుణాలను మహిళలకు అందించి మరింత అభివృద్ధి సాధించాలని తద్వారా స్త్రీ నిధిని ఒక పూర్తి స్థాయి బ్యాంకు మహిళలకు అందుబాటులోనికి తీసుకొని రావాలని కోరారు. తదుపరి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ నిధి బ్యాంకు ద్వారా ప్రతి మహిళ లబ్ధి పొందే విధముగా అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్ వారు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమానికి నెల్లూరు జిల్లా నుండి డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. నాగరాజ కుమారి అన్ని మండల సమాఖ్యల అధ్యక్షుల వారికి స్త్రీ నిధి రుణాలు వలన ప్రతి మహిళా ఇంటి వద్ద నుండి సులభముగా ఎటువంటి ఖర్చు లేకుండా త్వరితగతిన రుణము పొందే అవకాశం ఉన్నదని అందరు సభ్యులు దీనిని సక్రమముగా ఉపయోగించుకొని తిరిగి 100 శాతము రికవరి చేసి ఎక్కువ మంది మహిళలకు స్త్రీ నిధి బ్యాంకు ను అందుబాటులోనికి తీసుకొని వచ్చి మన జిల్లా ను మెరుగైన స్థానములో ఉంచాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమములో స్త్రీ నిధి ఏజిఎం కామాక్షయ్య, అన్ని మండల సమాఖ్య అధ్యక్షులు, పట్టణ సమాఖ్య అధ్యక్షులు, అన్ని క్లష్టర్ల స్త్రీ నిధి బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** పెండింగ్ కేసుల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన కాలాన్ని వృధా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా అటువంటి కేసులకు పూర్తిస్థాయిలో పరిష్కారం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి. చైతన్య అన్నారు. కోవూరులోని కోర్టు ప్రాంణంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ లోక్ అదాలత్‌పై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని సత్వర న్యాయం పొందాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులన్నింటికీ పూర్తిస్థాయిలో చట్టభద్రత కూడా ఉంటుందన్నారు పెండింగ్ కేసుల పరిష్కారానికి కోర్టు చుట్టూ తిరుగుతూ కక్షిదారులు విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా రాజీకి వీలు పడే కేసులను లోక్ అదాలత్‌లో సులువుగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి జె. కాత్యాయని, లోక్ అదాలత్ సభ్యులు సీహెచ్ చంద్రమోహన్, పి. వీరేంద్ర , న్యాయవాదులు, తదితరులు ఉన్నారు.

## కొండాపురం మండలంలో సాగునీటి సంఘ అధ్యక్షులువీరే

**కలిగిరి(కొండాపురం)డిసెంబర్14, ప్రభాతవార్త;** కొండాపురం మండలంలో జరిగిన సాగునీటి సంఘాలజరిగిన ఎన్నికల్లో 22సాగునీటిసంఘాలకు ఎన్నికలు జరగ వలసిఉండగా 21 సాగునీటి ఎన్నికలు జరిగాయి. 21సాగునీటి సంఘాలను టిడిపి కైవసం చేసుకుంది. మండలంలోని ఇసుక దామెర్లసాగునీటి సంఘానికి ఎనికజరగలేదు. ఇది ఇలా ఉండగా మండలంలోని గానుగపెంట సాగునీటి సంఘాల ఎన్నికల్లో కొంత గందరగోళం ఏర్పడింది. విఆర్ఓ సంతకంతో పోటీదారులు వెళ్లగా తాసిల్దారు సంతకంలేదని వచ్చిన వారిని అధికారులు పోటీలోపాల్గొననీయలేదు. దానితో కొంత గందరగోళ పరిస్తితి ఏర్పడినా చివరకు టిడిపిబలపరచిన వ్యకికే విజయం వరించింది. ఇక ఇసుకదామెర్లలోకూడా అవతల వర్గానికి అడ్డుచెప్పడంతోనే ఎన్నిక వాయిదాపడినట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా ఉదయగిరి యంఎల్ఏ కాకర్లసురేష్ ఈ ఎన్నికల్లో పట్టుసాధించారని తెలుగుతమ్ముళ్లు సంబరాలు జరుపుకుంటున్నారు.

## సాగునీటి ఎన్నికల్లో కూటమి హవా



**కందుకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** కందుకూరు నియోజకవర్గ రైతులు, ప్రజలు తనపై కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయనని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో జరిగిన 45 సాగునీఋ సంఘాల ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో మైనర్ చెరువులు 35, మీడియం 6 చెరువులు ఎన్నికలు ఏకగ్రీవం కావడం జరిగిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ ఎన్నికల్లో పోటీ చేయడం జరిగిందన్నారు. కాలువలను, చెరువులను అభివృద్ధి చేసుకుంటూ చివరి ఆయకట్టు వరకు ప్రతి ఎకరాకు నీరందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలవడానికి కృషి చేసిన ప్రతి ఒక్క రైతును అభినందిస్తున్నానని, వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా, ఏకష్టం రాకుండా జాగ్రత్తగా చూసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి సాగునీటి సంఘాల అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులు, మెంబర్‌లుగా గెలుపొందిన వారు ధన్యవాదాలు తెలిపారు.

## పడమటిపాళెం నీటి సంఘం అధ్యక్షులుగా గంగపట్నం చంద్రశేఖరయ్య



**సంగం డిసెంబర్ 15 ప్రభాతవార్త :** సంగం మండలం పడమటిపాళెం నీటి సంఘం అధ్యక్షులుగా గంగపట్నం చంద్రశేఖరయ్య ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. అలాగే ఉపాధ్యాక్షులుగా మర్రి సందీప్ ఏకగ్రీవంగా ఎన్నికై య్యారు. డైరక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సంద ర్భంగా నూతన అధ్యక్షులు గంగపట్నం చంద్రశేఖరయ్య మాట్లాడుతు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశీస్సులతో ఈ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయయని ఆయన తెలిపారు. అలాగే నాయకులకు, డైరక్టర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. ఈకార్యక్రమంలో సీనియర్‌నాయకులు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, వంగల్లు రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు. మండలం మొత్తం 44 టిసిలకు 43 ఏకగ్రీవం కాగా ఒక్క టిసికి పోటి జరిగింది. సంగం పంపింగ్ స్కీమ్ సాగునీటి సంగం అధ్యక్షులుగా షేక్ బాబు, ఉపాధ్యాక్షులుగా నాటకరాణి శ్రీనయ్య, ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. చెన్నవరపాడు సాగునీటి సంఘం అధ్యక్షులుగా ముత్యాల చిన్న కోటయ్య, ఉపాధ్యాక్షులుగా పావళ్ళ మాల్యాద్రి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. జంగాలదొరువు సాగునీటి సంఘం అధ్యక్షులుగా పడిగిరెడ్డి రాజారెడ్డి, ఉపాధ్యాక్షులుగా మన్నవరపు వెంకటనరసయ్య ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. మర్రిపాడు సాగునీటి సంఘం అధ్యక్షులు పులిబోయిన శ్రీహరి, ఉపాధ్యాక్షులుగా కంచే చిన పెంచలయ్య ఏకగ్రీవంగా ఎన్ని కైయ్యారు. మండలంలో అన్ని నీటి సంఘాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని నోడల్ ఆఫీసర్ వినయ్‌కుమార్ తెలిపారు.

## జనసేన జెండాను ఆవిష్కరించిన ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి




**నెల్లూరు, డిసెంబరు14 ప్రభాతవార్త–విద్య :** నెల్లూరు నగరంలోని ఆరవ డివిజన్ పప్పులవీది వాటర్ ట్యాంక్ వద్ద శనివారం జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నాయకులు మంచికంటి శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర టిడ్కోచైర్మన్ వేముల పాటి అజయ్‌కుమార్ పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పార్టీ బలోపేతానికి అందరూ శక్తి వంచన లేకుండా కృషిచేయ్యాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కోర్ కమిటీ సభ్యులు నూనెమల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, సుందరరామిరెడ్డి, జనసేన పార్టీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నాయకులు కె.కృష్ణారెడ్డి, రవికుమార్, శ్రీరామ్, పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, గుర్రం కిషోర్‌బాబు, ప్రసాద్ యాదవ్, మనోజ్, కరీం , ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సాగు నీటి సంఘాల ఎన్నికలు



**వెంకటాచలం, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** వెంకటాచలం మండలంలోని 12 సాగునీటి సంఘ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సాగునీటి సంఘ ఎన్నికల కోసం కేటాయించిన కేంద్రం వద్ద ఎన్నికలను అధికారులు నిర్వహించారు. మండలంలోని 12 నీటి సంఘాటలకు గాను 12 ఏకగ్రీవంగా పెరిగాయి. నిడిగుంటపాలెం సాగు నీటి సంఘానికి బాజాపా మండల అధ్యక్షులు కుంచ శ్రీనివాసుల యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఈడగాలి గ్రామానికి చల్లా నాగార్జున్ రెడ్డి, ఈడిమేపల్లి గ్రామానికి ఏలూరు క్రిష్ణ రెడ్డి, సర్వేపల్లి గ్రామానికి తెనాలి రమణయ్య కనుపూరుకు వల్లూరు రమేష్, గుడ్లూరు వారి పాలెం ఈపూడు సుబ్బారెడ్డి తనికేపల్లికి పులి హరికృష్ణ యాదవ్, కంటేపల్లి కి బోరుబోయిన మాదవయ్య, కస్మూరు కు బుర్ర రత్నమ్మ కందలపాడు కు రామకృష్ణయ్య, పూడిపత్తి కి జాన శ్రీనివాసులు పార్చర్లపాడు కు వల్లూరు మాలాద్రి ని ఎన్నుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిఐ సుబ్బారావ్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల సరలిని నోడల్ ఆఫీసర్ ఎం.పెంచల్రావు పరివేక్షించారు.

## లెక్చరర్ శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపిన అధ్యాపకులు



**ఉలవపాడు, డిసెంబర్ 14, ప్రభాతవార్త** బాపట్ల జిల్లా సంతమాగులూరులో సివిక్స్ జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న కే.శ్రీనివాసరావు పదోన్నతిపై జీవీఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉలవపాడు నందు రెగ్యు లర్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఇప్పటి వరకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పని చేసిన గారపాటి గోపిచంద్ ప్రకాష్, అధ్యాపక, అధ్యా పకేతర సిబ్బంది నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## దేవుడు పాదాల వద్ద శాంతి హోమం



**బిట్రగుంట డిసెంబర్ 14 ప్రభాతవార్త: :** బోగోలు మండలం కొత్తూరు తాళ్లూరు రోడ్డు మధ్యగల శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి పాదాలచెంత శనివారం భక్తులు శాంతి హోమం నిర్వహించారు. ఇటీవల ఈ ప్రసన్న వెంకటేశ్వర స్వామి పాదాల వద్ద ఏర్పాటుచేసిన గుడిలో ఆగంతకుడు ఉన్న దేవుడు ఫోటోలను కుప్పగా వేసి దగ్ధం చేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో భక్తులందరూ దేవుడు కొత్త ఫోటోలు తీసుకొని వచ్చి దేవుడు పాదాల గుడిలో అమర్చి పాపప్రక్షాళన కొరకు శాంతి హోమాన్ని నిర్వహించారు.

## సాయి మందిరంలో దత్త జయంతి

**బిట్రగుంట డిసెంబర్ 14 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన బోగోలులోని స్వర్గీయ అమరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శనివారం శ్రీ దత్త జయంతి నిర్వహించారు. సాయిసేవకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు.

## లోన్ యాప్స్ పట్ల అప్రమత్తం అవసరం

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకోవడంతో పాటు మోసపూరిత లాటరీ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నౌరాజ్ అన్నారు. శనివారం నెల్లూరు జనార్ధన్ రెడ్డి కాలనీలో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత , పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నౌరాజ్ మాట్లాడుతూ అప్పుల విషయంలో జాగ్రత్తగా వుండాలని, గుర్తింపు పొందిన సంస్థలలో మాత్రమే అప్పులు తీసుకోవాలని సూచించారు. గతంలో లోన్ యాప్‌ల బారిన పడి అధిక వడ్డీలు కట్టలేక, బ్లాక్ మెయిలింగ్ తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడిన సంగతి గుర్తు చేశారు. ఆర్బీఐ సౌజన్యంతో పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవల పై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన పోస్టర్లు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యదర్శి షేక్ అహ్మద్ మాట్లాడుతూ పొదుపు అవసరం, సైబర్ నేరాలపై బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. అలాంటి గోప్యతా వివరాలను బ్యాంకులు అడగవని గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుల వ్యవస్థను ఉపయోగించుకొని సత్వర సక్రమ ఆర్థిక సేవలను పొందాలన్నారు. బ్యాంకింగ్ అంబుడ్స్ మెన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రిసోర్స్ ఎ.చంద్రశేఖర్, కె.వెంకటేశ్వర్లు రజియాబేగం, బ్యాంకు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.

## నెల్లూరుజిల్లాస్థాయి జూడో పోటీలకు ఎంపికలు

**కావలిరూరల్, డిసెంబర్14 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్‌వారి ఆధ్వర్యంలో ఈ నెల 16వతేదీ ఉదయం 10గంటలకు కావలి మద్దూరుపాడు డిబియస్ ఇంజనీరింగ్ కళాశాలనందు నెల్లూరు జిల్లాస్థాయి జూడో పోటీలకు ఎంపికలు జరుగుతున్నట్లు జూడో జిల్లా అడహక్ అధ్యక్షులు మురళి శనివారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాలు పైపడినవారికి ఈ సెలక్షన్లు జరుగుతాయని తెలియచేశారు. ఇందులో సెలెక్ట్ అయినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకోవడం జరుగు తుందని తెలియచేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కరారు. ఈ సెలక్షన్‌కు వచ్చేటపుడు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని తెలియచేశారు. సెలక్షన్‌కు వచ్చేవారు టి.సురేష్‌ను సంప్రదించాలని లేదా 8919036160 సెల్‌నెంబర్‌నైనా సంప్రదించాలని కోరారు.

## మన్నంగిదిన్నె జూటూరు చెరువుల నీటిసంఘాల ఎన్నికలు ఏకగ్రీవం



**కావలిరూరల్, డిసెంబర్14 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం మన్నంగిదిన్నె చెరువు, తాళ్లపాలెం జూటూరు చెరువుల నీటిసంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవం కావడం జరిగింది. ఈ ఎన్నికల్లో మన్నం గిదిన్నె చెరువు నీటిసంఘం అధ్యక్షులుగా ఉప్పాల తిరుపతి,ఉపాధ్యక్షులుగా జంపాని రమణయ్య, టీసీలుగా వంటేరు మధు, గుద్దేటి తిరుమలరావు, అనుపల్లి వెంకటేశ్వర్లు, గుడిపల్లి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికకావడం జరిగింది. తాళ్లపాలెం జూటూరు నీటిసంఘం అధ్యక్షులుగా బండ్ల మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా మోర్ల తిరుపతిస్వామి టీసీలు పానిగల సుమలత, కోరా వెంకటేశ్వర్లు, బలగాని బాలయ్యలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరివురిని ఆముదాలదిన్నె టిడిపి నాయకులు ఉప్పాల శ్రీనివాసులు, మోర్లవెంకట్రావు, ఉప్పాల దినేష్, నాసిన ప్రసాద్‌గౌడ్, అహ్మద్, రఫి, దేవా, ఉప్పాల వెకంట్రావు, మోర్ల తిరుపతి స్వామి కైదుపల్లి చక్రపాణి, తదితరులు పాల్గొని వారిరువురిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది.

## బాదుల్లాకు సహాయం చేసి హ్యాపీ సేవాసంస్థ



**కావలిరూరల్, డిసెంబర్14 ప్రభాతవార్త :** హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో పక్షవాతంతో బాధపడుతున్న కావలి పట్టణం వెంగళరావునగర్ వాసి షేక్.బాదుల్లాకు శనివారం హ్యాపీసేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా, విశ్వోదయ పూర్వవిద్యార్ధుల సహకారంతో ఒకనెల సరిపడా మందులు, ప్రొటీన్ ఆహారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్వోదయ పూర్వవిద్యార్ధుల సహకారం ఎంతో అభినందనీయమని వారి సహాయంతో గత తొమ్మిది నెలలుగా షేక్.బాదుల్లా కుటుంబానికి అండగా నిలుస్తున్న ప్రతి ఒక్క మిత్రునికి అభినందనలు తెలియచేశారు. ప్రతి ఒక్కరూ ఈ విధంగానే సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాదుల్లా కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సాగునీరు ఎన్నికల ప్రక్రియ పరిశీలన తాసిల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు విడవలూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండల కేంద్రం జడ్పీ హైస్కూల్లో సాగునీటి సంఘాల ఎన్నికల కొడవలూరు బిట్ 1 ప్రక్రియను తాసిల్దార్ స్ఫూర్తి రెడ్డి పరిశీలన చేశారు. నీటి సంఘాల సంబంధించి అధి కారులు జాగ్రత్తగా ఎన్నికల జరపాలని సంబంధిత అధి. కారులకు సూచించారు. అనంతరం ఎన్నికల ఓటర్ జాబి తాను పరిశీలన చేసి తగిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు తదితరులు పాల్గొ న్నారు.

## హెల్త్ అసిస్టెంట్లను విధుల పాలు చేయడం దారుణం



**నెల్లూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త -వైద్యం :** వైద్యశాఖలో 22 ఏళ్లు, 20 ఏళ్లు, 15 ఏళ్లుగా హెల్త్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారిని తెలంగాణా కోర్టు తీర్పు పేరుతో తొలగించి విధుల పాలు చేయడం దారుణమని, ఏపీ హంస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజర్ల సుధాకరరావు, కమల్ కిరణ్‌లు పేర్కొన్నారు. శనివారం వారు నగరంలోని సంతపేటలో ఉన్న హంస జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు మలేరియా విభాగంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కొల్లి లక్ష్మణరావు ఇలా ఉద్యోగాన్ని పోగొట్టుకుని ఆందోళన పడి గుండెపోటుతో ఈ రోజు మృతి చెందడం బాధాకరమన్నారు. నెల్లూరులో ఇప్పటికే ఇలా దీర్ఘకాలికంగా పని చేస్తున్న 54 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. మరో 110 మంది తమను ఏక్షణంలో తీసేస్తారని అనుక్షణ భయంతో బతుకుతున్నారు. ఇక్కడి వైద్యశాఖాధికారులు సైతం అత్యుత్సాహంతో పని చేస్తూ కోర్టు నిబంధనలు కూడా పాటించలేదని విమర్శించారు. కోర్టు తీర్పు ప్రకారం వారికి 3 నెలలు ముందుగా నోటీసులు ఇచ్చి 3 నెలలు జీతాలు ఇచ్చి తీసేయాల్సి ఉందన్నారు. అలాకూడా చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అంతే కాకుండా మళ్లీ మెరిట్ ఆర్డర్ ప్రకారం సర్టిఫికేట్లు పరిశీలించి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. వీరి పట్ల మానవత్వం ప్రదర్శించాలన్నారు. 20 ఏళ్లకు పైగా ఉద్యోగాలు చేసి వయోభారంతో ఇప్పుడు ఏ పనులు చేయలేని దశలో ఉన్న వారిని తొలగించడం ఎంత వరకు సబబు అన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పును గౌరవిస్తూ రిటైర్మెంట్‌కి చేరువలో ఉన్న ఇక ఎలాంటి ఉద్యోగాలు చేయలేని హెల్త్ అసిస్టెంట్ల మానసిక వేదనను, వారి కుటుంబ పరిస్థితుల ఆవేదనలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో వారిని యధావిధిగా ఉద్యోగాల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏపీ హంస తరుపున అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మజురుల్లా పాల్గొన్నారు.

## ఉదయగిరిలో కోడిగుడ్డు ధర రూ.10లు



ఉదయగిరి, డిసెంబర్ 14, ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరిలో కోడిగుడ్డు ధరలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం కోడిగుడ్డు ధర పలు ప్రాంతాలలో రూ.7.50కు చేరింది. వారం రోజులు క్రితం వరకు ఈ ధర రూ.5 నుండి రూ.6వరకు ఉండేది వచ్చే క్రిస్మస్‌ను ఇయర్ వేడుకల నేపథ్యంలో గుడ్డు ధరలకు రెక్కలు వచ్చినట్లు స్థానికులు వాపోయారు. మరిన్ని రోజుల్లో ఈ ధర రూ.10కి చేరొచ్చని వ్యాపారులు వెల్లడించారు.

## బెల్లంకొండ రమణయ్యకు చేజర్ల నివాళులు



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** నందమూరి బాలకృష్ణ వీరాభిమాని, తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త బెల్లంకొండ రమణయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు శనివారం రాళ్లమిట్టలోని వారి నివాసంలో రమణయ్య మృతదేహానికి తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు శివకుమార్, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణారెడ్డి, సురేష్, అశోక్, తదితరులు ఉన్నారు.

## వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఇంటూరి



**కందుకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** కందుకూరు పట్టణంలో 25 వ వార్డులో పొడపాటి నాగేశ్వరరావు కుమారుడు శివకుమార్ వివాహం సందర్భంగా వారి ఇంటి వద్ద జరిగిన వివాహ కార్యక్రమానికి కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి డీఈ



**ఉదయగిరి, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలు సందర్భంగా మీడియాతో ఇరిగేషన్ అధికారి డీఈ చంద్రమౌళి ఈ సందర్భంగా మాట్లాడుతూ గండిపాలెం సబ్ డివిజన్ ప్రాజెక్టు పరిధిలో 34 సాగునీటి సంఘాలకు ఎలక్షన్ నిర్వహించగా ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని సాగు నీటి సంఘాలు ఏకగ్రీవం జరగటం జరిగిందన్నారు. ఈఎలక్షన్‌కు సహకరించిన అధికారులకు, సిబ్బందికి ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నలదలపూరు చైర్మన్‌గా అత్తోటి రవి

**వలేటివారిపాలెం డిశంబరు 14, ప్రభాతవార్త :** మండలంలోని నలదలపూరు సాగునీటి సంఘం అధ్యక్షుడుగా అత్తోటి రవి,ఉపాధ్యక్షుడుగా బత్తిన రంగస్వామి,సభ్యులుగా బాబూరావు, ఉన్నం మాల్యాద్రి, తన్నీరు వెంకటేశ్వర్లు,దేపూరి నరసింహంలు ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ఎంపీడీవో నరేంద్ర దేవ్ తెలిపారు. అదే విధంగా పోకూరు సాగునీటి సంఘం అధ్యక్షుడుగా అత్తోట వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షుడుగా నలమోతు వెంకటేశ్వర్లు,సభ్యులు: గురిజాల ఆనందం, ముళ్లమూడి పెదకొండయ్య, మల్లెబోయిన ఆదెయ్య,బండి గోవింద య్యలు ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ఎం.హేమంత్‌భరత్‌కుమార్ ప్రకటించారు.శాఖవరం అధ్యక్షుడుగా వడ్ల మూడి మాలకొండయ్య, ఉపాధ్యక్షుడుగా ఘట్టమనేని వెంకటేశ్వర్లు, సభ్యులుగా కూరాకుల వెంకటేశ్వర్లు, వడ్లమూడి నారాయణమ్మ,గణపర్తి బ్రహ్మయ్య,బత్తిన శేషగిరిరావులు ఎంపియ్యారు.

## గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టం కావాలి



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ అమలుకై కోవూరులోని ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం సీనియర్ నాయకులు వి. కృష్ణయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయకృష్ణ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ, మందా పెంచలయ్య మాదిగలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వవర్గీకరణ సాధన కొరకు 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసి ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పోరాటానికి నిదర్శనమన్నారు. అటువంటి నాయకుడి నాయకత్వంలో పనిచేయడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై మాలల్లో కొంతమంది చేస్తున్న కుట్రను మాదిగలు తిప్పి కొట్టాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని, మంద కృష్ణ మాదిగ నెల్లూరు జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా దానిని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు వి. వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్‌పీ మహిళా ఇన్‌చార్జి జి. జానకి, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు ఎస్. పెంచలయ్య మాదిగ, మాలకొండయ్య మాదిగలు ఉన్నారు.

**- కమిటీలు ఏకగ్రీవం** కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఇన్‌చార్జులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఇందుకూరుపేట మండలానికి ఇన్‌చార్జిగా బి. రామచంద్రయ్య మాదిగ, విడవలూరు మండలానికి పి. శ్రీనివాసులు మాదిగ, కొడవలూరు మండలానికి ఎం. కొండయ్య మాదిగ, కోవూరు మండలానికి ఎం. గుర్నాప్రసాద్ మాదిగ, బుచ్చి మండలానికి డి. శ్రీనివాసులు మాదిగలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

## పడుగుపాడు సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఉన్న పడుగు పాడు సహకార సొసైటీ స్థలంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభి ంచారు. ఈ మేరకు సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలన చేపట్టారు. ఈ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అన్ని ఉత్తర్వులు రావడం జరిగిందని,త్వరలో భూమి పూజ కార్యక్రమంతో పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకు స్థాపన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పరిధిలోని రైతులు , కాంట్రాక్టర్లు ఉన్నారు.

## మెగా లోక్ అదాలత్‌లో 3574 కేసులు పరిష్కారం



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 3574 కేసులు పరిష్కారం అయ్యాయి. అందులో క్రిమినల్ కేసులు 3546 కాగా.. 15 కేసులు సివిల్‌తో పాటు వివిధ బ్యాంకులకు సంబంధించిన 13 కేసులు కూడా పరిష్కారమయ్యాయి.బ్యాంకులకు సంబంధించి 4.99 లక్షలు సెటిల్‌మెంట్ కావడం జరిగింది. సివిల్ కేసులు సంబంధించి,26లక్షలు సెటిల్‌మెంట్ కావడం జరిగింది. ఈ మెగా లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి పి. చైతన్య, జూనియర్ సివిల్ జడ్జి జె. కాత్యాయని, లోక్ అదాలత్ సభ్యులు సీహెచ్ చంద్రమోహన్, పి. వీరేంద్ర, న్యాయవాదులు , బీఎస్ఎన్ఎల్ ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ సంబంధిత బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు.

## పశాంతంగ సాగునీటి సంఘ ఎన్నికలు

**జలదంకి, డిశంబర్14, ప్రభాతవార్త:** జలదంకి మండలంలో సాగునీటి సంఘ ఎన్నికలు ప్రశాంతంగ జరిగాయి.శనివారం ఉదయంనుంచి చేపట్టిన ఈప్రక్రియ ఎలాంటి గొడవలు వంటివి లేకుండ అంతా ఏకగ్రీవంగ ముగిశాయి.అధికార ఎన్‌డిఎ కూటమి నేతలు తమ అనుచరులను,నాయకులను ఎన్నుకయ్యే క్రమంలో సఫలీకృతమైనారు.మండల టిడిపి అధ్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డి,సీనియర్ నాయకుడు వంటేరు జయచంద్రారెడ్డి,పూనూరు భాస్కర్‌రెడ్డి,తల్లపనేని మధుసూదన్‌నాయుడు,కూరపాటి మాలకొండారెడ్డి,గంటా అశోక్ తదితర నేతలు ఆయా నీటిసంఘాల అధ్యక్షులుగ ఏకగ్రీవంగ ఎన్నికై తమ హవాకొనసాగించారు.అలాగే జనసేన నేత నిమ్మలపల్లి రామచైతన్య తన అనుచరులను ఎన్నికయ్యేలా పావులు కదిపి సఫలీకృతమైనారు.మండలంలో మొత్తం 20 చెరువులు,సోమశిలకాలువ పరిధిలోని 8నీటిసంఘాలు వున్నాయి.వీటన్నింటికి ఆయా సంఘాల పరిధిలో ఉదయంనుంచే ఎన్నికల అధికారులు ప్రక్రియను చేపట్టారు.నిభందనల కనుసరించి నామినేషన్లు వెంటివి పూర్తిచేశారు.అనంతరం ఎన్నికైన వారికి ధృవీకరణ పత్రాలు అందజేశారు.దీనికి సంబందించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు ఎస్ఐ లతీవున్నీషా తనసిబ్బందితో శాంతి భద్రతలను పర్యవేక్షించారు.కాగ వైసిపి శ్రేణులు ఈఎన్నికలక దూరంగ వుండడం గమనార్హం.

## ప్రశాంతంగా ముగిసిన సాగునీటి సంఘం ఎన్నికలు



**వరికుంటపాడు,డిసెంబర్ 14,ప్రభాతవార్త :** మండలంలోని 11 గ్రామాల చెరువులు,గండిపాళెం ప్రాజెక్టు క్రింద ఉన్న 9 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సంబందించిన ఎన్నికలు ప్రశాం తంగా ముగిసినట్లు నోడల్ అధికారి అంకులయ్య, అబ్జర్వర్ హేమంత్ కుమార్ లు తెలిపారు. మండలంలోని నక్కలగండి రిజర్వాయర్ అధ్యక్షుడుగా వేమూరి మధు సూధన్‌రావు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే తోటల చెరువుపల్లి చెరువు చైర్మన్‌గా దొడ్డా మౌలాలి ఎంపికయ్యారు. కనియంపాడు చెరువు చైర్మన్‌గా పోలుబోయిన వెంగమ్మ ఎకగ్రీవంగా ఎంపికయ్యారు.నార్తు కొండాయపాళెం చెరువు చైర్మన్ గా ఇంగ్లే లక్ష్మీనరసమ్మ ఎకగ్రీవంగా ఎంపికయ్యారు.గణేశ్వరాపురం చెరువు చైర్మన్ గా బాదంగురవారెడ్డి ఎంపికయ్యారు. గువ్వాడి చెరువు చైర్మన్ గా అలా గాంధీ ఎంపికయ్యారు. గండిపాళెం ప్రాజెక్టు 6 వ నెంబర్ కాలువ చైర్మన్‌గా దుద్దుకూరి వెంకటరత్నం,వైస్ చైర్మన్ గా దేవరకొండ చెంగయ్య ,7 వ నెంబర్ కాలువ చైర్మన్ గా ఆలేటి భానుకుమార్,వైస్ చైర్మన్ గా గంగవరపు పద్మయ్య , 9 నెంబర్ కాలువ చైర్మన్ గా ముజ్జే చిన లక్ష్మయ్య,8 వ నెంబర్ కాలువ చైర్మన్ గా మాలెం హజరత్ రెడ్డి ఎంపికయ్యారు.5 వ నెంబర్ కాలువ చైర్మన్ గా పులివర్తి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 3 వ నెంబర్ కాలువ చైర్మన్ గా మైనంపాటి కొండయ్య ఏకగ్రీవంగా ఏన్నికయ్యారు.4 వ నెంబర్ కాలువ చైర్మన్ గా బోగినేని శ్రీనివాసులు ఎంపికయ్యారు.ఈ నీటి సంఘం ఎన్నికలు ఎకగ్రీవంగా కావడంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్ర మధుసూదన్‌రావు,జెడ్పిటిసి సభ్యుడు రావెళ్ల నాగేంద్ర,క్లస్టర్ ఇన్‌చార్జ్ పోకా మహేష్,మండల ప్రధానకార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్,తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణ లు తనదైన శైలిలో వ్యవహరించారు.అలాగే తెలుగుదేశం పార్టీ నేతలు పేరం సుధాకర్ రెడ్డి,పావులూరి రవీంద్రబాబు ,గుర్రం గోపి,పొద మాధవ్ రావు లు కీలక పాత్ర వహించారు.

## సాగునీటి సంఘాల ఎన్నికల ఏకగ్రీవం



**బిట్రగుంట డిసెంబర్ 14 ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని 20 సాగునీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సాగునీటి సంఘాల ఎన్నికలకు వైఎస్ఆర్సిపి దూరంగా ఉండడంతో టిసి లు అన్ని ఏకగ్రీవం కావడంతో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు లు ను డైరెక్టర్లు ఎన్నుకొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా భయభ్రాంతులకు గురి చేయడం తగదు



**బిట్రగుంట డిసెంబర్ 14 ప్రభాతవార్త:** సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా తమ అభ్యర్థుల్ని పోటీ చేయకుండా పోలీస్ యంత్రాంగం భయభ్రాంతులకు గురి చేయడం తగదని మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్సిపి కావలి నియోజకవర్గం సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో సాగునీటి ఎన్నికల సందర్భంగా ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారనే నెపంతో మండల వైసీపీ కన్వీనర్ మద్దిబోయిన వీరబాబు యాదవ్ ను బిట్రగుంట పోలీసులు స్టేషన్ కు తీసుకొచ్చి సెల్ ఫోన్ లాక్కోడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేసారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సమయంలో ఎవరికి బలాబలాలు ఉంటే వారు నెగ్గుతారని అంతేగాని అధికార పార్టీ వారు చెప్పినట్లు నామినేషన్లు వేయకుండా బలవంతంగా ఓటర్లను కలవనీకుండా పెత్తనం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులకు మాజీ ఎమ్మెల్యే ఫోన్ చేసి ఇక్కడ జరిగిన పరిణామాల్ని వివరించడంతో అర్ధరాత్రి ఈ హైడ్రామా ముగిసింది. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు మాట్లాడుతూ తన వద్ద కేవలం 530 రూపాయలు మాత్రమే ఉన్నాయని ఎన్నికల్లో నగదు పంపిణీ చేసి లబ్ది పొందుతున్నామని పోలీసులు అభియోగం చేయడం సరి అయిన పద్ధతి కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి పోలీస్ స్టేషన్ కు చేరుకోవడం తోటే ద్వితీయ శ్రేణి నాయకులంతా గుమి కోడడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.

## కోవూరు మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతం



**కోవూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని ఇనమడుగు, పాటూరు, కోవూరుకు సంబంధించిన సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో ఎవరూ పోటీలో లేకపోవడంతో ఏకగ్రీవంగా ఈ మూడు నీటి సంఘాలు ఎంపికయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో మూడు నీటి సంఘాలు జరిగే ప్రాంతాల్లో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ ఏర్పాట్లను కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబా, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు పోటీలు లేకుండా ఏకగ్రీవంగా జరగడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. గెలుపొందిన సాగునీటి సంఘాల పాలకవర్గాలు కాలువల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న వైసీపీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా



**కందుకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బుర్రా మధుసూదన్‌యాదవ్ నియోజకవర్గంలో శనివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవాలయ శిలా ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు వివాహ మహోత్సవాలు, కార్యకర్తల పరామర్శలు, కూటమి ప్రభుత్వం వేదింపులకు గురైన సోషల్ మీడియా కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ పర్యటన కొనసాగింది. ముందుగా వలేటివారిపాలెం మండలం నలదలపూరు గ్రామంలో వేంచేసిన సీతా సమేత కోదండరామ ఆలయంలో అంగరంగ వైభవంగా జరిగిన శిలా ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణంలోని యజ్ఞశాలను సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కందుకూరు పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్ హాల్ నందు జరిగిన దాసరి శ్రీనివాసులు కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరుని సాక్షిగా ఆశీర్వదించారు. అనంతరం గుడ్లూరు మండలంలోని వైఎస్ ఎంపీపీ మేనల్లుడు పోలుబోయిన వారి వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి వారు అందించిన అతిధి మర్యాదలను స్వీకరించి వివాహ విందులో పాల్గొన్నారు. గుడ్లూరు గ్రామంలోని సోషల్ మీడియా కార్యకర్త మున్విత‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేస్తున్న కూటమి ప్రభుత్వం యొక్క దుర్మార్గాన్ని నిరసిస్తూ ఆ కుటుంబానికి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన ఆర్థిక భరోసాను అందించారు. ఇదే మండలం పొట్లూరు వైఎస్సార్‌సీపీ కార్యకర్త చలంచర్ల శ్రీనివాసులు అనారోగ్యంతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటుండగా అక్కడికి వెళ్లి కార్యకర్తను పరామర్శించి యోగక్షేమాలను తెలుసుకుని మనోధైర్యం తెచ్చుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో తోకల కొండయ్య, పాశం కొండయ్య, ముప్పవరపు కిషోర్, గణేశం గంగిరెడ్డి, చీమల వెంకట రాజా, షేక్ రహీమ్, కాపులూరి కృష్ణ, మాధవరెడ్డి, సీహెచ్ సురేష్, జి.రమేష్, పెన్నా కృష్ణయ్య, పులి రమేషన, చెరుకూరి బ్రహ్మయ్య, షేక్ అబ్దుల్ కలాం, మాధవ, కళ్యాణ్, జి.ప్రసన్న కుమార్ తదితరులు బుర్రా వెంట ఉన్నారు.

## మోపాడు సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



**కందుకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండలంలోని మోపాడు గ్రామంలో సాగునీటి సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. చైర్మన్‌గా తోకలు మాల్యాద్రి, వైస్ చైర్మన్‌గా ఈర్ల వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. టీసీ మెంబర్లుగా మనసాని శ్రీనివాసరావు, తోకల వెంకటేశ్వర్లు, ఈదర రమణయ్య, మాదాల నాగేంద్ర, మాదాల వెంకట సుబ్బయ్య, బెల్లంకొండ వెంకయ్య, గొంది కోటయ్య, రావుల మాలకొండయ్య, తలమంచి వెంకటేశ్వర్లు, గుంజి బసవయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికార యంత్రాంగంతో పాటు ఎన్నికల అధికారులు, గ్రామ ప్రజలు మోపాడు తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు తోకల వెంకటేశ్వర్లు, రావుల రవి, ఈదర వెంకటేశ్వర్లు, తోకల కోటేశ్వరరావు, తోకల మల్లిఖార్జునరావు, ఇంటూరి రమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టీబీ కుష్టులను నివారిద్దాం



**నెల్లూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త-వైద్యం :** జిల్లాలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న టీబీ, అలాగే ఇంకా అక్కడక్కడ కనిపిస్తున్న లెప్రసీ జబ్బులను నిర్మూలించే లక్ష్యంతో వైద్య సిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా టీబీ, లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్ వలి పేర్కొన్నారు. శనివారం నగరంలోని రాజాగారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్, చాకలి వీధిలో ఉన్న అర్బన్ కేంద్రాన్ని ,జిల్లా క్షయ నివారణ కేంద్రంలో ఉన్న లాబొరేటరీని, ఐసీటీసీ కేంద్రాన్ని ,బీవీ నగర్లో ఉన్న డామియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్టు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. చేసిన పరీక్షలు, గుర్తించిన టీబీ, లెప్రసీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. చేసిన పరీక్షలు,గుర్తించిన టీబీ, లెప్రసీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా అర్బన్ హాస్పిటల్ కేంద్రాలలో సిబ్బందితో డాక్టర్ ఖాదర్వ లి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ఇంకా టీబీ, లెప్రసీ కేసులు నమోదవడం బాధాకరమన్నారు. ప్రజలు అవగాహన లేక, తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వల్లనే ఈ జబ్బులు వస్తున్నాయన్నారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలుంటే టీబీగా అనుమానించి దానితో పాటు గళ్లపరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే రాగిరంగు, తేనెరంగు, నలుపు రంగులలో పెద్ద, పెద్ద మచ్చలుండి స్పర్శలేకపోతే లెప్రసీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మొదట్లోనే ఈ జబ్బులు గుర్తిస్తే తగిన వైద్యం ద్వారా త్వరగా నయం చేయవచ్చున్నారు.

## సాగునీటి సంఘ ఎన్నికల విజయంపై హర్షం



**ఉదయగిరి, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవంగా విజయం సాధించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయగిరి మండల కన్వీనర్ చింతనబోయిన బయన్నయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఈ విధానం రద్దు చేయబడిన విషయం అందరికి తెలిసిందేనని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాగునీటి సంఘాల బలోపేతం కోసం సమర్ధవంతమైన నీటి నిర్వహణ కోసం మళ్ళీ ఎన్నికలు జరిపారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎంతో చొరవతో ప్రతి కార్యకర్తతో నేరుగా మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యేలా కృషి చేశారని అన్నారు. అలాగే 11 చెరువులకు గండిపాలెం డ్యాం కింద ఆరు డిస్ట్రిబ్యూటర్లకు ఎన్నికలు సమర్ధవంతంగా జరిగాయని ఆనందంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్‌సీ రమణారెడ్డి, బొజ్జ నరసింహులు, నల్లిపోగు నరసింహులు, సుబ్బారెడ్డి, ఉమా మహేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శివకృష్ణ రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా సాగునీటి సంఘం ఎన్నికలు



**వింజమూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలో శనివారం సాగునీటి సంఘ ఎన్నికలు సజావుగా ముగిశాయి. మండలంలో 17 సాగునీటి సంఘాలు ఉండగా ప్రాదేశిక సభ్యులతో 102 మందిని ఎన్నుకున్నారు. వీరిలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఉన్నారు. చెరువుల వివరాలు ఎర్రబల్లిపాలెం గున్నం శ్రీనివాసులురెడ్డి, పాతూరు చెరువు నక్కాసాయమ్మ, తమీదపాడుచెరువు చైర్మన్‌గా మండాది మాల్యాద్రి, బత్తినివారిపల్లి చెరువు ప్రెసిడెంట్‌గా ఒరుగంటి చిన్న వెంకటయ్య, బుక్కాపురం చెరువు ప్రెసిడెంట్‌గా కర్ణ శ్రీనివాసులు, చాకల కొండ చెరువు ప్రెసిడెంట్‌గా మాధవరావు, వెంకటేశ్వర్లు, చంద్ర పాడిచెరువు ప్రెసిడెంట్‌గా వేమూరు దొరస్వామి, కాటేపల్లి చెరువు ప్రెసిడెంట్‌గా వల్ల చిన్న మాధవయ్య, మలపరాజు వారు చెరువు ప్రెసిడెంట్‌గా గంగపట్ల కొండమ్మ, ఊటుకూరు నందిగుడి వాగు చెరువు ప్రెసిడెంట్‌గా మాదినేని కొండయ్య, తక్కెళ్ళపాడు చెరువు ప్రెసిడెంట్‌గా అంకి ఆదెమ్మ, ఊటుకూరు ఊరచెరువు ప్రెసిడెంట్‌గా గోరంట్ల నాగభూషణం, రామలింగారెడ్డి చెరువు ప్రెసిడెంట్‌గా గణపం చంద్రారెడ్డి, రావిపాడు చెరువు ప్రెసిడెంట్‌గా దంతులూరు కృష్ణయ్య, శంఖవరం చెరువు ప్రెసిడెంట్‌గా భూమిరెడ్డి పెంచల్‌రెడ్డి, ఏకిస్తీపురం ప్రెసిడెంట్‌గా లక్కు రమణయ్య, నల్లగొండ చెరువు ప్రెసిడెంట్‌గా అన్నపురెడ్డి తిరుపాల్‌రెడ్డి ఎన్నికకాగా మరి ప్రెసిడెంట్‌తో పాటుగా వైస్ ప్రెసిడెంట్‌ను కూడా ఎన్నుకున్నారు. మండలంలో ఎలాంటి అవకతవకలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగినట్లు నోడల్ అధికారి నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

